సాక్షి కామారెడ్డి

సోమవారం । 29 । జూలై । 2024



సైబర్ నేరగాళ్ల బెదిరింపులు

డ్రగ్స్ కేసుల పేరుతో సైబర్ నేరగాళ్లు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరిని బెదిరించారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

- 10లో ▸



విద్యుత్ శాఖలో 'ఈ-స్టోర్'

విద్యుత్ సేవలను మరింత మెరుగుపర్చేందుకు టీజీఎస్పీడీసీఎల్ ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.3 /22.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు రెండో విడత రుణమాఫీ

కామారెడ్డి క్రైం: రెండో విడత పంట రుణాల మాఫీకి ముహూర్తం ఖరారయ్యింది. మంగళవారం రూ. 1.50 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయనుంది. ఈ విషయాన్ని డీఏవో భాగ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వస్తే రైతులకు సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఈనెల 18వ తేదీన రూ. లక్షలోపు రుణాలను మాఫీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం రెండో విడతలో రూ. 1.50 లక్షలలోపు రుణాలను మాఫీ చేయనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌నుంచి వర్చువల్ విధానంలో రుణమాఫీని ప్రారంభిస్తారని డీఏవో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు.

రేపు సౌత్ క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం జియో ఇన్ఫర్మాటిక్స్ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, క్యాంపస్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాత నాగరాజు, కోఆర్డినేటర్లు ప్రతిజ్ఞ, నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. క్రైనోస్ జియో స్పెషల్ టెక్నాలజీ కంపెనీ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జియో ఇన్ఫర్మాటిక్స్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

2న జిల్లా స్థాయి జావెలిన్‌త్రో ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి జావెలిన్ త్రో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికలు, స్త్రీ, పురుషుల విభాగాలలో వంద, 400 మీటర్ల అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం తీసుకుని స్పోర్ట్స్ యూనిఫాంలో హాజరుకావాలని సూచించారు.

18 వరకు ఓపెన్ డిగ్రీ, పీజీ ప్రవేశాలకు అవకాశం

కామారెడ్డి అర్బన్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి వచ్చేనెల 18వ తేదీ చివరి తేదని వర్సిటీ కామారెడ్డి స్టడీ సర్కిల్ సమన్వయకర్త రాజ్‌కుమార్ తెలిపారు. డిగ్రీ రెండో, మూడో సంవత్సరం చదుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఆగస్టు 18లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. 2015-16 విద్యాసంవత్సరం నుంచి 2023-24 విద్యాసంవత్సరం వరకు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొంది ఫీజులు చెల్లించలేక పోయిన వారు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకొని పరీక్షలు రాయవచ్చని తెలిపారు.

నిజామాబాద్ రీజియన్‌కు 64 ఈవీ బస్సులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌కు 64 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి ఆదివారం తెలిపారు. శనివారం నిజామాబాద్-2 డిపోకు మూడు ఎలక్ట్రికల్ బస్సులు వచ్చాయన్నారు. మిగతా బస్సులు విడతల వారీగా రానున్నాయని పేర్కొన్నారు. వీటిని నిర్మల్, వరంగల్, హైదరాబాద్‌లకు నడిపించనున్నామన్నారు.

గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లలో ప్రవేశం కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రాంతీయ సమన్వయాధికారి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులకు ఈనెల 30న ఉదయం 10 గంటలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ కల్పిస్తారని తెలిపారు. నవీపేట్ కళాశాలలో ఎస్సీ-8, మైనారిటీ -1, బాన్సువాడలో ఎస్సీ -6, ఎస్సీ(సీసీ)-1, మైనారిటీ-1, ఓసీ-1, తాడ్కోల్‌లో ఎస్సీ -10, ఓసీ -1, తాడ్వాయిలో ఎస్సీ -7, ఎస్సీ(సీసీ)-1, ఓసీ -1, తక్కడపల్లిలో ఎస్సీ- 8, ఎస్సీ(సీసీ)-1, మైనారిటీ -1, దోమకొండలో ఎస్సీ -5, మైనారిటీ -1, ఎంపీసీలో, ఎక్లారా కళాశాలలో సీఈసీలో ఎస్సీ -36 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.



ఎల్లారెడ్డిలో బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బోనం.. సంబురం

జిల్లాలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ, మైసమ్మ ఆలయాల వద్దకు వెళ్లి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పలుచోట్ల వనభోజనాలకు వెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడలో బోనం ఎత్తిన ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

ధర్నాలతో ఇక్కట్లు

- కలెక్టరేట్ మెయిన్ గేటు ఎదుట బైఠాయిస్తున్న ఆందోళనకారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఉద్యోగులు, అధికారులకూ అవస్థలే..
- ధర్నా చౌక్‌కు స్థలం కేటాయించాలంటున్న ప్రజలు



కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

సాక్షి, కామారెడ్డి: సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఆందోళనలు చేస్తుంటారు. ధర్నాలు, బైఠాయింపుల ద్వారా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తారు. అయితే జిల్లా కేంద్రంలో ప్రజలు ధర్నాలు చేయడానికి ప్రత్యేక స్థలం లేకపోవడంతో ఆందోళనకారులు కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట బైఠాయిస్తున్నారు. దీంతో కలెక్టరేట్ లోనికి వెళ్లేందుకు ప్రజలు, ఉద్యోగులు, అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

రోజూ ఇదే పరిస్థితి

ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి కలెక్టరేట్‌కు వస్తుంటారు. అయితే కొత్త కలెక్టరేట్ ప్రారంభించి మూడేళ్లు గడచినా ధర్నా చౌక్‌కు స్థలాన్ని కేటాయించలేదు. దీంతో వివిధ సంఘాలు, పార్టీలు, సంస్థలు తమ సమస్యలపై నిరసన తెలపడానికి కలెక్టరేట్ వద్దకు వచ్చి, ప్రధాన గేటు ఎదుట బైఠాయిస్తున్నారు. చాలాసేపు నిరసన ప్రదర్శనలు కొనసాగుతుండడంతో కలెక్టరేట్‌కు వివిధ పనులపై వస్తున్నవారు, అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి నిరసనకారులతో గొడవలూ జరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక సమస్యపై నిరసన కార్యక్రమాలు జరుగుతూనే ఉండడంతో రోజూ కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి ఇబ్బందికరంగా మారుతోంది.

విద్యార్థులు, కార్మిక సంఘాలు, రైతుల ధర్నాలు ఉంటే రెండు, మూడు గంటలు కూడా గేటు మూసివేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ గొడవ సమయంలో వేలాది మంది రైతులు కలెక్టరేట్ మెయిన్‌గేటు ఎదుట బైఠాయించారు. దీంతో ప్రజలు అటు వెళ్లడానికి ఇబ్బంది పడాల్సి వచ్చింది. అలాగే కాయితీ లంబాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌ను ముట్టడించి బైఠాయించిన రోజున కూడా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రజలు రోడ్డు మీద వెళ్లడానికి కూడా అవస్థలు పడ్డారు. ఒక్కోసారి ధర్నాలతో కలెక్టరేట్ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయి కలెక్టర్ కూడా వేరే మార్గాన వెళ్లాల్సి వస్తోంది.

ప్రధాన గేటు మూసేస్తుండడంతో..

కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు ఉన్నపుడల్లా పోలీసులు ప్రధాన గేటును మూసివేస్తున్నారు. గేటును మూసివేయడంతో పాటు బారికేడ్లు, లోపలి వైపున ముళ్ల కంచెలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కార్యాలయనికి పనుల కోసం వచ్చే ప్రజలు మరో ద్వారం నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంకో ద్వారం నుంచి వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా స్థలం కేటాయిస్తే..

కలెక్టరేట్ సమీపంలో కావాల్సినంత స్థలం ఉంది. అక్కడ ధర్నాలు చేసుకునేందుకు స్థలం కేటాయిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఆయా సంఘాలు, పార్టీలు అక్కడే టెంట్లు వేసుకుని ధర్నా చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ధర్నాల కోసం స్థలాన్ని కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఊరంతా కలిసి.. అమ్మను కొలిచి..



గ్రామదేవత విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు



పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


- నిజామాబాద్‌లో ఘనంగా ఊర పండుగ

నిజామాబాద్‌అర్బన్: ఇందూరు ప్రజలు ఆదివారం ఊర పండుగను ఘనంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించారు. ఉదయం 9 గంటల సమయంలో ఖిల్లా వద్ద గ్రామదేవతల విగ్రహాల ఊరేగింపు ప్రారంభమైంది. ఊరేగింపులో అమ్మవారి తొట్ల కింది నుంచి వెళ్లడానికి భక్తులు పోటీపడ్డారు. వినాయక్‌నగర్‌లో మత్తడి పోచమ్మ, ఐదుచేతుల పోచమ్మ, మహాలక్ష్మమ్మ, దుబ్బ ప్రాంతంలో పోడాలమ్మ, పెద్దమ్మ, అడెల్లి పోచమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అలాగే సిర్నపల్లి గడిలో సమీపంలో కస్బాగల్లి వద్ద కొండల్‌రాయుడి, బోగంసాని సార్గమ్మ, రాట్నం, పాతగంజ్‌లో అంపుడు పోచమ్మ, విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంటువ్యాధులు రాకుండా కాపాడాలని ఆయురారోగ్యాలతో పాడిపంటలు విలసిల్లేలా చూడాలని భక్తులు కోరారు. గాజుల్‌పేట్‌లో భక్తులు 'సరి' కోసం గుంపులుగా పోటీపడడంతో తోపులాట జరిగింది. పోలీసులు వారిని చెదరగొట్టారు. ఉదయం ఊరేగింపు ప్రారంభించే ఖిల్లా గద్దె వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు స్వామి, భరత్ భూషణ్, నరేందర్, కాంగ్రెస్ నాయకులు కేశ వేణు, రత్నాకర్ పాల్గొన్నారు.



గ్రామ దేవతల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సాగర్‌లోకి 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



సింగితం రిజర్వాయర్ అలుగుపైనుంచి పారుతున్న వరద నీరు

నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,389.08 అడుగుల(3.693 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

పొర్లుతున్న సింగితం రిజర్వాయర్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ పొంగి పొర్లుతోంది. ఆదివారం సింగితం రిజర్వాయర్‌లోకి 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.550 మీటర్లతో నిండుకుండలా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వస్తుండడంతో రిజర్వాయర్ అలుగుపైనుంచి పొంగి పొర్లుతోంది.

'పోచారం'లోకి..

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి ఆదివారం 723 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. లింగంపేట, గాంధారి, తాడ్వాయి మండలాల్లో కురుస్తున్న వర్షాలతో లింగంపేట, గుండారం వాగుల ద్వారా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 11 అడుగుల(0.552 టీఎంసీ) నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.



పోచారం ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

'సింగితం' జలాలు వృథా

- అలుగుకు బుంగలతో వాగు పాలవుతున్న నీరు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

నిజాంసాగర్ : సింగితం రిజర్వాయర్ అలుగుకు బుంగలు పడి నీరంతా వృథాగా పోతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు చేరడంతో రిజర్వాయర్ నిండుకుండలా మారినా బుంగల ద్వారా వందలాది క్యూసెక్కుల జలాలు వృథా అవుతున్నాయి. నిజాంకాలంలో మహమ్మద్ నగర్, నర్వ గ్రామాల మధ్య ఉన్న కొత్త చెరువును నిర్మించారు. ఎగువ నుంచి వరద ఎక్కువగా ఉండటంతో యేటా రెండు నుంచి మూడు టీఎంసీల నీరు వాగులోకి వెళ్లేది. దీంతో నిజాంసాగర్ ప్రధాన కాలువ మొదటి ఆయకట్టుకు వరద నీటి మళ్లింపు కోసం 1999లో ప్రభుత్వం సింగితం రిజర్వాయర్‌ను నిర్మించింది. అప్పటి కొత్త చెరువు ఇప్పుడు సింగితం రిజర్వాయర్‌గా రికార్డుల్లోకి ఎక్కింది. ప్రతీ యేటా వానాకాలం ప్రారంభంలోనే రిజర్వాయర్ నిండుకుండలా మారి నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆయకట్టుకు జలాలను అందిస్తోంది. అయితే నర్వ శివారులో ఉన్న రిజర్వాయర్ అలుగు వద్ద బుంగలు పడటంతో వందలాది క్యూసెక్కుల జలాలు వృథా అవుతున్నాయి. మూడు రోజుల కిందట రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఎగువ నుంచి 150 నుంచి 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తున్నా బుంగలు ద్వారా నీరు వృథాగా వెళ్తోంది. రిజర్వాయర్ కింద 345 ఎకరాల ఆయకట్టు ఉండగా నర్వ, మహమ్మద్ నగర్, గున్కుల్ గ్రామ శివారుల్లో ఆయకట్టు ఉంది. బుంగల ద్వారా నీరు వృథా అవుతుండటంతో యాసంగిలో ఆయకట్టుకు నీరు అందడం లేదు. బుంగలు పూడ్చాలని రైతులు కోరుతున్నారు. అంతేగాక రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు శిథిలావస్థకు చేరాయి.



అలుగు బుంగ ద్వారా వృథాగా పోతున్న నీరు



శిథిలావస్థకు చేరిన రిజర్వాయర్ అలుగు

మరమ్మతులు చేయాలి



రిజర్వాయర్ అలుగు బుంగలు పెద్దగా మారుతున్నాయి. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పాలాలకు అందాల్సిన సాగు నీరు బుంగల ద్వారా మంజీరా నది పాలు అవుతోంది. బుంగలకు మరమ్మతులు చేయాలి.

– నామ అంజయ్య, రైతు, నర్వ

యాసంగి పంటలకు ఇబ్బంది



సింగితం కింద వానాకాలంలో పంటలు పండుతున్నా.. యాసంగి పంటలకు ఇబ్బంది అవుతోంది. రిజర్వాయర్ నిండినా సగం నీరు బుంగుల ద్వారా ఖాళీ అవుతున్నాయి. పంట కాలువలు కూడా శిథిలావస్థకు చేరడంతో చివరి ఆయకట్టుకు నీళ్లు అందని పరిస్థితి నెలకొంది.

– పెంటబోయిన రాజయ్య, రైతు, నర్వ

నిధులు మంజూరయ్యాయి



సింగితం అలుగు బుంగలకు మరమ్మతులకు ప్రభుత్వం రూ.19.5 లక్షలు మంజూరు చేసింది. నెల క్రితం నిధులు వచ్చాయి. టెండర్ ప్రక్రియ చేపట్టాలి. తాత్కాలిక మరమ్మతులకు రూ.90 వేలు ఉన్నా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

– సోలోమన్, ఈఈ నీటిపారుదల శాఖ

క్లుప్తంగా

నేడు బోధన్‌కు చాగంటి కోటేశ్వరరావు రాక



బోధన్: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వేదమూర్తులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు బోధన్ పట్టణానికి సోమవారం రానున్నారు. విజయసాయి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'విలువలతో కూడిన విద్య' అనే అంశంపై చాగంటి విద్యార్థులనుద్దేశించి ప్రవచించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులను కార్యక్రమానికి ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీకి విశ్రాంత ఉద్యోగి పార్థివదేహం



బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లికి చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి గంధె రాంకిషన్(83) అనారోగ్యంతో నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. ఆయన వ్యవసాయ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. మృతుడి కోరిక మేరకు ఆయన పార్థివ దేహాన్ని సోదరుడి కుమారుడు విశ్వప్రసాద్, కూతుళ్లు విమల, విజయగంగా, బంధువులు కలిసి శనివారం రాత్రి నిజామాబాద్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ విషయాన్ని అవయవ, శరీరదాతల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి ఆదివారం తెలిపారు. గతంలో తమ సంఘం అధ్వర్యంలో అవయవ, శరీరదాన అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలో రాంకిషన్ శరీరదానం చేస్తానని ప్రమాణపత్రం ఇచ్చారని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆసరాగా..

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు : కాలేయవ్యాధితో బాధపడుతున్న యువతి ఆరోగ్యం బాగుకోసం పారిశ్రామికవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి రూ. లక్ష ఇచ్చేందుకు ఆదివారం ముందుకొచ్చారు. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన షేక్ అజియా కాలేయవ్యాధితో బాధపడుతోందని, కాలేయ శస్త్రచికిత్స కోసం రూ. 30 లక్షలు అవసరమవుతుందని, దాతలు ఆదుకోవాలని పేర్కొంటూ 'సాక్షి'లో 'తల్లీ.. ఈ కష్టం ఎవరికీ రావొద్దు' శీర్షికతో కథనం ప్రచురితం కాగా జనగామకు చెందిన పారిశ్రామికవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి స్పందించారు. ఈమేరకు ఆయన షేక్ అజియా కుటుంబీకులను జనగామలో తన ఇంటికి ఆహ్వానించారు. రూ. లక్ష సాయం చేస్తానని, అలాగే ప్రభుత్వపరంగా ఎల్‌వోసీ కోసం ప్రయత్నిస్తానని బాధిత కుటుంబీకులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డికి, కథనం ప్రచురించిన 'సాక్షి'కి అజియా కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ శాఖలో 'ఈ-స్టోర్'

- పేపర్ వర్క్ లేకుండానే సామగ్రి తీసుకునే సదుపాయం
- ఎస్ఈ రవీందర్ వెల్లడి



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ సేవలను మరింత మెరుగుపర్చడంలో భాగంగా వరంగల్ టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు 'ఈ – స్టోర్' విధానాన్ని ప్రవేశపెట్టినట్లు సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆర్ రవీందర్ ఆదివారం తెలిపారు. 'ఈ – స్టోర్' విధానంలో సేవలు పొందేందుకు.. సెక్షన్ ఏఈలు ముందుగా విద్యుత్ పనికి సంబంధించిన అవసరమైన సామగ్రి స్టోర్‌లో ఉందా? లేదా? ఆన్‌లైన్ ద్వారా తెలుసుకొని మెటీరియల్‌ను రిజర్వు చేసుకుంటారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్‌కు సంబంధించిన సమాచారం ఎస్ఏపీ వర్క్ ఫోన్ ద్వారా సంబంధిత ఏడీఈకి.. ఆ తరువాత స్టోర్స్‌కి వర్క్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో వెళ్తుంది. మెటీరియల్ అవసరం ఉన్న అధికారి ఏ రోజున, ఏ సమయానికి స్టోర్‌కు రావాల్సి ఉంటుందనే సూచనలతో ఎస్ఎంఎస్‌తోపాటు మెయిల్ వెళ్తుంది. ఈ ప్రక్రియలో పేపర్ వర్క్ ప్రస్తావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని ఎస్ఈ తెలిపారు. 'ఈ – స్టోర్' సేవల కారణంగా సమయం ఆదా కావడంతోపాటు త్వరితగతిన పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అంతకు ముందు మెటీరియల్ లిస్టును ప్రింట్ తీసుకొని, వాటిపై సంతకాలు చేయించి సంబంధిత అధికారికి అందజేసి సామగ్రిని తీసుకోవాల్సి ఉండేదన్నారు. ఈ సమస్యలను అధిగమించడానికే పేపర్ వర్క్ లేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, వినియోగదారులకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. అలాగే ఒక పనికి సంబంధించిన మెటీరియల్ ఏమైనా మిగిలి ఉంటి వేరే పనికి పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకొనే వెసులుబాటు మొత్తం కూడా ఆన్‌లైన్ లోనే చేశామని తెలిపారు. సాంకేతికతను అందిపుచుకుని వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని ఎస్ఈ తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి తైక్వాండోలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి తైక్వాండోలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయ్‌భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో బాల, బాలికల విభాగంలో పోటీలు నిర్వహించగా, జిల్లాకు చెందిన క్రీడాకారులు మెడల్స్ సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. క్రీడాకారులను కోచ్ మనోజ్ అభినందించారు. కేడెట్ బాలబాలికల విభాగం : రుత్విక, సిద్ధార్థ (బంగారు, రజత, కాంస్యం), భవ్య, సహస్రరాథోడ్(బంగారు), వినయ్ (కాంస్య) పతకాలుసాధించారు. బంగారుపతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 1 నుంచి 3వ తేదీ వరకు వైజాగ్‌లో నిర్వహించే జాతీయస్థాయి టోర్నీలో పాల్గొననున్నారు. జూనియర్ కేటగిరిలో అక్షరాస్ శ్రీనిధి, వినాయక్‌రాథోడ్ (బంగారు), వర్షిణి(రజత) పతకం సాధించారు. జూనియర్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 20న ఔరంగాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలి



సన్మానం పొందిన మున్నూరుకాపు విద్యార్థులతో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని మున్నూరుకాపు విద్యార్థులకు ఆదివారం బాన్సువాడలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు రాజకీయంగా, ఆర్థికంగా ఉన్న అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మున్నూరు కాపు కుటుంబాలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, కష్టపడి పంటలు పండిస్తారని, విద్యరంగంలో కూడా రాణించాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, తద్వార జీవితంలో ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు మామిండ్ల అంజయ్య, మాజీ జెడ్పీటీసీ ప్రదీప్‌పటేల్, బండివార్ విజయ్, సత్యనారాయణ, అంజయ్య, లింగం, శ్రీనివాస్ ఉన్నారు.

సీడ్ బాల్స్ తయారీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామంలో ఆదివారం స్వచ్ఛంద సంస్థ సెవెన్ హార్ట్స్ ఆర్గనైజేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారు చేసినట్లు ఎన్జీవో ఫౌండర్ జీవన్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ పవన్‌కళ్యాన్ మాట్లాడుతూ గతంలో మొదటి విడత సీడ్ బాల్స్ తయారు చేసి వేయగా మంచి ఫలితాలొచ్చాయన్నారు. రెండోవిడతలో తయారుచేసిన సీడ్ బాల్స్‌ను గ్రామ శివార్లలో, అటవీప్రాంతాల్లో వేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, మౌనిక, పూజిత, నవనీత, పూజ తదితరులున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల (2001 – 02 ఎస్సెస్సీ బ్యాచ్) ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ఒకరియోగక్షేమాలు మరొకరు తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు.

మూడో కల్లు డిపోపై ఎక్సైజ్ డైరెక్టర్ ఆరా!

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో కల్లు డిపోపై ఎక్సైజ్ డైరెక్టర్ ఆరా తీస్తున్నారు. ఇటీవల 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా సూపరింటెండెంట్ మల్లారెడ్డిని వివరణ కోరినట్లు తెలిసింది. మూడో డిపోలో ఇతర జిల్లాకు చెందిన కార్మికులు ఉన్నారని, 2007లో టాడీ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో ఇతర కార్మికులతో చెట్లు ఎక్కించి టాడీ లైసెన్సులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు మాత్రం వీటిని గుర్తించడం లేదు. ఈ డిపోకు చెందిన కల్లు దుకాణాల్లో లిక్కర్ అమ్మకాలు, ఇటీవల ఓ దుకాణంలో ఎక్సైజ్ అధికారులు మద్యం పట్టుకొని వదిలేసిన ఘటనపై ఎక్సైజ్ సూపరింటెండెంట్.. ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు మెమో ఇచ్చారు. మద్యం విక్రయిస్తున్నారనే మళ్లీ అదే కల్లుబట్టీపై దాడి చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత ఎక్సైజ్ రాష్ట్ర డైరెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తెలిసింది. దీంతోపాటు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ మూడో డిపో వ్యవహారాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా సూపరింటెండెంట్ మల్లారెడ్డికి సూచించినట్లు తెలిసింది. దీంతో నాలుగు రోజుల క్రితం కల్లు శాంపిళ్లు సేకరించినప్పటికీ.. ఆ ప్రక్రియపై సైతం ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సేకరించిన శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారా? లేక శాంపిళ్లను మార్చారా? అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ బైలాస్ నిబంధనలకు విరుద్ధంగా ఒకే కుటుంబానికి చెందిన వారిని సహకార సంఘంలో చేర్చడంపై గౌడ యువజన సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్‌కు, ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. అయితే, ఎక్సైజ్ అధికారులు నాన్చుడు ధోరణిని అవలంబించడం, స్పందన లేకపోవడంతో రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ సమగ్ర నివేదికను రూపొందించి అందిజేయాలని ఆదేశించినట్లు సమాచారం. మూడో కల్లు డిపోపై నగరానికి చెందిన పలువురు ఇప్పటికే రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, రాష్ట్ర డైరెక్టర్ ఆజయ్‌రావుకు ఫిర్యాదులు చేశారు.

ఎస్సారెస్పీకి పర్యాటకుల తాకిడి



ప్రాజెక్ట్ నీటి అంచున సందడి చేస్తున్న పర్యాటకులు



బైక్‌లపై తిరుగుతున్న యువకులు

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడం, ఆదివారం సెలవు దినం కావడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పర్యాటకులు పోటెత్తారు. ప్రాజెక్ట్‌పై సందడి చేశారు. నీటి అంచునకు వెళ్లి కేరింతలు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి వనభోజనాలు చేశారు.

3నుంచి రాష్ట్రస్థాయి క్యారం పోటీలు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర క్యారం అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మాండ్లు స్మారక రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారం పోటీలను ఆగస్టు 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు క్యారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు క్యాతం సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని జేబీఎస్ గార్డెన్‌లో మెన్ సింగిల్స్, ఉమెన్ సింగిల్స్, మెన్ డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు ఆగస్టు 1వ తేదీలోగా ఎంట్రీ ఫీజు చెల్లించాలని, మరిన్ని వివరాలకు శోభన్‌రాజ్ (94403 07023)ను సంప్రదించాలని సూచించారు.

సర్వరోగ నివారిణి యోగా



కామారెడ్డి అర్బన్ : మందులతో నయం కాని మానసిక, శారీరక వ్యాధులకు యోగా, ధ్యానమే శరణ్యమని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అన్నారు. కామారెడ్డి జై హన్‌మాన్ యోగా కేంద్రం 14వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక రాంమందిర్‌లో యోగాచార్యులు గరపల్లి అంజయ్య అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా రాంరెడ్డి హాజరై మాట్లాడారు. యోగా శిక్షకులు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రం, ఆర్గనైజింగ్ కార్యదర్శి జే కిషన్, పి అంజయ్య, రఘుకుమార్, జైహన్‌మాన్ యోగా కేంద్రం సహాచార్యులు యెల్లంకి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బీబీపేట: ఆర్టీసీ బస్సు, టీవీఎస్ ఎక్సెల్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని తుజాల్‌పూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తుజాల్‌పూర్‌కు చెందిన గరిగంటి లక్ష్మయ్య (65) వ్యవసాయ పనుల నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్‌పై ఆకారం రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన దుబ్బాక డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. లక్ష్మయ్య కింద పడిపోగా తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే అంబులెన్స్ కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

రేకుల షెడ్డు దగ్ధం

బాన్సువాడ : బీర్కూర్ మండలం వీరాపూర్‌లో ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అజ్మత్ కుటుంబం రేకుల షెడ్డులో నివాసం ఉంటోంది. వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం రేకుల షెడ్డులో షార్ట్‌సర్క్యూటై సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దుస్తులతోపాటు వస్తువులు పూర్తిగా కాలిపోయాయని, తనను ఆదుకోవాలని అజ్మత్ కోరుతున్నాడు.

విద్యార్థి అదృశ్యం

నవీపేట: మండలంలోని అంజుమాన్‌ఫారం గ్రామానికి చెందిన విద్యార్థి కడాలి అశోక్ అదృశ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. ఈనెల 26న ఉదయం పాఠశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన అశోక్ ఇంటికి తిరిగిరాలేదని, కుటుంబ సభ్యులు వెళ్లి ఆరా తీయగా అశోక్ పాఠశాలకు సైతం రాలేదని తెలిసిందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అశోక్ తల్లి జయమ్మ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బోధన్‌కు చెందిన యువతి..


బోధన్‌టౌన్: పట్టణానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. శనివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారని, ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరయ్య తెలిపారు.

గ్రామ హద్దురాళ్ల తొలగింపు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్, కుర్నాపల్లి గ్రామ సరిహద్దు వివాదం కొంతకాలంగా కొనసాగుతోంది. పంటపొలాల శివారులో వివాదం కొనసాగడంతో ఇటీవల సర్వే ఏడీ వెంకటేశ్వరరావు హద్దులను ఏర్పాటు చేశారు. అయితే, హద్దులను సూచిస్తూ ఏర్పాటు పాతిన రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. పదేళ్లుగా రెండు గ్రామాల సరిహద్దు విషయంలో రైతులకు గొడవలు జరుగుతున్నాయి. హద్దు రాళ్ల తొలగింపు ఘటనపై ఠాణాకలాన్ గ్రామ రైతు సలీం ఎడపల్లి పోలీసులతోపాటు బోధన్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

ఐజీ పేరిట సైబర్ మోసానికి యత్నం


- అపరిచిత వ్యక్తి బెదిరింపు ఫోన్‌కాల్
- అప్రమత్తంగా వ్యవహరించిన సింగంపల్లి వాసి
- పోలీసుల దృష్టికి ఫోన్‌కాల్ వ్యవహారం



భూమేశ్‌కు వచ్చిన వాట్సాప్ కాల్ స్క్రీన్ షాట్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన భూమేశ్‌కు అపరిచిత వ్యక్తి నుంచి ఆదివారం ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి తనను ఐజీనని పరిచయం చేసుకుని బెదిరింపులకు దిగడంతో, అప్రమత్తమైన భూమేశ్ కాల్ కట్ చేసి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయంతోపాటు ఎలక్ట్రీషియన్ పనులు చేసే భూమేశ్ కోడలు గౌతమి డెలివరీ కోసం లింగంపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో భూమేశ్‌కు వాట్సాప్‌కాల్ చేసిన అపరిచిత వ్యక్తం తాను పోలీసుశాఖ ఐజీనని, మీ కోడలు గౌతమిని డ్రగ్స్ కేసులో అదుపులోకి తీసుకున్నామని హిందీలో చెప్పాడు. భూమేశ్ వెంటనే కాల్ కట్ చేసి కోడలికి ఫోన్ చేయగా, తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పింది. సదరు వ్యక్తి మళ్లీ వాట్సాప్ కాల్ చేసి ఫోన్ కట్ చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. ఇంతలోనే ఒక వీడియో కూడా పంపించాడు. అందులో మహిళలను కొడుతున్నట్లు ఉంది. కాల్ కట్ చేస్తే భూమేశ్‌పై అత్యాచారం కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. తర్వాత వీడియో డిలీట్ చేశాడు. భూమేశ్ తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నానని చెప్పగా, సదరు వ్యక్తి తాను కూడా వస్తున్నానని చెప్పాడు. భూమేశ్ ఈ విషయాన్ని మోపాల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. జిల్లా కేంద్రంలో ఊరపండుగ బందోబస్తులో ఉన్న ఎస్సై గంగాధర్ సోమవారం విచారణ చేపడుతానని చెప్పినట్లు భూమేశ్ తెలిపాడు. ఫోన్ నంబర్‌ను పోలీసులు పరిశీలించగా, పీకే పేరుతో ఉన్నట్లు తేలింది. భూమేశ్ అప్రమత్తంగా వ్యవహరించడంతో సైబర్ మోసానికి గురికాకుండా తప్పించుకున్నాడు. దుండగులు కుటుంబసభ్యుల పేర్లు, వివరాలు చెప్పి, డ్రగ్స్ కేసు పేరుతో బెదిరింపులకు పాల్పడుతారని, అనంతరం బేరసారాలకు దిగి ఎంతో కొంత డబ్బులు దోచేస్తారని, ప్రజలు ఇలాంటి ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కాగా, అపరిచిత వ్యక్తి వాట్సాప్ డీపీలో పోలీస్ ఉన్నతాధికారి ఫొటో, మనోజ్‌కుమార్ అనే పేరు ఉంది. శనివారం మండలంలోని చిన్నాపూర్‌కు చెందిన మంగ్యాకు కూడా అపరిచిత వ్యక్తి నుంచి కాల్ వచ్చినట్లు తెలిసింది.

రాంపూర్‌కు చెందిన మహిళకు బెదిరింపులు..



సైబర్ నేరగాడి వాట్సాప్ కాల్ హిస్టరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన అంజలి అనే మహిళను వాట్సాప్ కాల్ ద్వారా సైబర్‌నేరగాడు బెదిరించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. తన పేరు రామకృష్ణ అని, తాను క్రైం పోలీసునని ఓ సైబర్ నేరగాడు అంజలికి ఆదివారం ఉదయం ఫోన్ చేశాడు. బహ్రెయిన్‌లో ఉంటున్న మీ నాన్న పెంటయ్య మాదకద్రవ్యాలు సరఫరా చేస్తూ పట్టుబడ్డాడని, అతడిని వదిలేయాలంటే రూ.10వేలు ఫోన్ పే చేయాలని అన్నాడు. ఆందోళనకు గురైన అంజలి తన అన్నయ్యకు విషయం తెలిపింది. వెంటనే అనిల్ దుండగుడు చేసిన నంబర్‌కు తిరిగి వాట్సాప్ కాల్ చేసి బహ్రెయిన్‌లో ఉంటున్న పెంటయ్యను చూపించాలని అనడంతో దుండగుడు కాల్ కాట్ చేశాడు. ఆ వెంటనే తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడగా, తాను క్షేమంగా ఉన్నానని తెలపడంతో.. బెదిరింపులు సైబర్‌నేరగాళ్ల పని అని నిర్ధారించుకున్నారు. దీనికి ముందు గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తికి సైతం సైబర్‌నేరగాడు వాట్సాప్ కాల్ చేసినప్పటికీ, నెట్ ఆఫ్ చేసి ఉంది. స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఆలయంపై కూలిన చెట్టు



రేపల్లెవాడలో హనుమాన్ ఆలయంపై కూలిన చెట్టు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో ఆదివారం హనుమాన్ ఆలయంపై చెట్టు కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులకు గ్రామంలోని చెట్టు ఆలయంపై కూలడంతో ఆలయం పూర్తిగా దెబ్బతిందని గ్రామస్తులు తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను మండలంలోని బొప్పాస్‌పల్లి వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. నస్రుల్లాబాద్‌కు చెందిన పరశురాంగౌడ్ బీర్కూర్ మండలం మంజీరా నదిలో నుంచి, ఔరాద్‌కు చెందిన ప్రకాశ్ పాతంగల్ మండలం జల్లపల్లి వాగులో నుంచి ఔరాద్‌కు ఇసుకను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు టిప్పర్లను పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకట్‌రావు తెలిపారు.